# నా రెండో కథ

"నా ముప్పయ్యో ఏట సన్యాసం స్వీకరించాన్నేను.

సన్యాసమంటే ఏ గురువు దగ్గరా ఉపదేశం పొందలేదు. ఇల్లూ, ఊరు వదిలిపోనూలేదు.

ఉన్న ఊళ్ళో స్వంత ఇంట్లో, వారసత్వపుటాస్తితో సన్యాసిలా జీవిస్తున్నాను నేను. గత పాతిక సంవత్సరాలుగా దేశంలో ఏం జరుగుతోందో ప్రపంచం ఏమైపోతుందో నేను పట్టించుకోలేదు. అసలు మా ఊళ్ళోనే ఏం జరుగుతోందో నాకు తెలియదు. పాతిక సంవత్సరాలుగా నేను ఇల్లు కదలనట్లే లెక్క. ఎప్పుడైనా అత్యవసర పరిస్థితిలో ఇల్లు కదలవలసి వచ్చినప్పుడు పరిసరాలను పట్టించుకునేవాణ్ణి కాదు. గుడ్డివాడి సంచారంలా, వెళ్ళి నా పని చేసుకువచ్చేవాడిని.

నా వద్ద ఆధ్యాత్మిక రంగానికి సంబంధించిన ఎన్నో పుస్తకాలున్నాయి. పాతిక సంవత్సరాలుగా వాటిని పారాయణం చేస్తున్నాను. అర్థం చేసుకుని ఈ జీవిత రహస్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. ఉపనిషత్తులూ, భగవద్గీతా చదివి అర్థం చేసుకోవడానికి నాబోటి వాడికి జీవిత కాలం చాలదు. పాతిక సంవత్సరాలేపాటి?

ప్రస్తుతం నాకు ఏ బాధలూ లేవు. చీకూ, చింతా లేదు. బంధుత్వాలూ, మమకారాలూ లేవు. నాకున్న అనుబంధమల్లా మా వంటవాడు. ఇతర ప్రపంచంతో సంబంధం పెంచుకోవాలని నేను భూములన్నీ అమ్మేసి వచ్చిన డబ్బుని బ్యాంకులో వేసేశాను. వచ్చే వడ్డీతో సుఖంగా జీవిస్తున్నాను. నా సుఖ జీవనానికి కారణం చాలా వరకూ నా వంటవాడు.

అతని పేరు సత్యం.అతనికీ నాకూ అయిదు సంవత్సరాల వ్యత్యాసముంటుంది వయసులో. అతనే నా కన్నా పెద్ద. అతనికీ ఎవ్వరూ లేరనుకుంటాను. గత పాతిక సంవత్సరాలుగా అతను నాతోనే ఉంటున్నాడు. అతనికి నేను అడిగినప్పుడల్లా డబ్బిస్తాను. అతనువేళ తప్పకుండా వంట చేసి పెడుతుంటాడు. ఈ పాతిక సంవత్సరాలలో ఒక్క పర్యాయం కూడా నన్ను వదిలి వెళ్ళలేదతను.

ఒక విధంగా అతనూ సన్యసించాడనే చెప్పుకోవచ్చు. నేను ఆధ్యాత్మిక పారాయణ చేస్తుంటే అతను వంట చేస్తున్నాడు. మిగతా విశేషాలన్నీ ఇద్దరికీ సమంగా సరిపోతాయి.

ముప్పై ఏళ్ళ క్రితం నాకూ జీవితం మీద మమకారముండేది. ఎందుకుండదు? చెప్పుకోదగ్గ ఆస్తి, అందముండి అనుకూలవతియైన భార్య ఉన్నవాడికి లోకం నందనవనంలా కనపడుతుందనుకుంటాను.

తల్లిదండ్రులకు ఏకైక సంతానం కాబట్టి అల్లారుముద్దుగా పెరిగాను. గారాబం నన్ను పాడుచేయలేదు. చెడు అలవాట్లకు లోనుకాకుండా శ్రద్ధగా చదువుకుని ఎం.ఏ. ప్యాసయ్యాను. నేనెక్కడుంటే అక్కడకు వచ్చి ఉండేవారు అమ్మా, నాన్నా. వారితోటిదే ప్రపంచం నాకు. అంత ప్రేమనూ, సమయాన్నీ నా కోసం వెచ్చించగల తలిదండ్రులుండడం నా అదృష్టం.

నా ఇరవై రెండో ఏట అమ్మ పోయింది. ఈ లోకంలో ప్రతి జీవికీ మరణం సహజమని అందరికీ తెలుసు. కానీ కన్నతల్లి కూడా అటువంటి జీవియేనని చటుక్కున ఎవరికీ తోచదు. పుట్టింది మొదలు అంతవరకూ నీడలా అంటి పెట్టుకుని సాకుతూ వచ్చిన అమ్మ మరి నా కళ్ళకు కనపడదన్న కఠిన సత్యం నాకు జీవితం మీద తాత్కాలికంగా విరక్తి కలిగించింది.

అమ్మ పోయిన ఏడాదికి నా వివాహం జరిపించారు నాన్నగారు. నా పెళ్ళి కళ్ళారా చూడాలని, కోడలి మీద అధికారం చెలాయించాలని అమ్మ చాలా సరదా పడుతూ ఉండేది. నాకు పెళ్ళి జరిగింది. కానీ అమ్మ సరదాలు తీరలేదు.

పెళ్ళి నాకు జీవితం మీద కొత్త మోజు కలిగించింది. నా భార్య శాంత రూపమూ, మనసూ కూడా చక్కనివి. ఇంటా బయటా ఆమె మంచి పేరు సంపాదించుకుంది. నా ఇరవయ్యారో ఏట నాన్నగారు పోయారు.

అమ్మ పోయినప్పుడే గ్రహించవలసింది, ఎప్పుడో నాన్నగారికీ మరణం రాసిపెట్టి ఉందని. కానీ ఎందరో నూరేళ్ళు బ్రతుకుతున్నప్పుడు నాన్నగారు యాభయ్యోపడిలో ఉండగానే నాకు కాకుండా పోతారని నేననుకోలేదు. మనుమడిని ఆడించాలన్న జీవితాశయంతో బ్రతుకుతున్న ఆయనకా కోరికా తీరలేదు.

తల్లిదండ్రులు పోయాక శాంత నాకు ఏకైక ఆలంబనమయింది. వారు లేని లోటు ఆమె చాలా చక్కగా తీర్చింది. ప్రపంచంలో బాధలు పడుతూండేవారు చాలా మంది ఉన్నారని గ్రహించి పరిసరాల్లోని పరిస్థితులను సునిశిత దృష్టితో గమనించడం మొదలు పెట్టాను. అప్పుడే నాకు ప్రజలను పీడిస్తున్న రకరకాల సాంఘిక సమస్యల ప్రభావం తెలిసివచ్చింది. ఈ కొత్త గ్రహింపు నాలో ఆవేశాన్ని కలిగించింది. ఫలితంగా ఒక కథ రాశాను. అది నాకు మొదటి కథ!

ఆ కథ ఓ ప్రముఖ పత్రికలో ప్రచురించబడింది. కథకు చాలా పేరు వచ్చింది. పలువురు ప్రముఖుల ప్రశంసలు లభించాయి.

అదే ఊపులో మరో కథ వ్రాయాలనుకున్నాను. కానీ కుదరలేదు. ఉన్న సమస్యలన్నీ ఒక కథలోనే వచ్చేశాయి. అప్పుడు దేనిమీద రాయాలో తెలియలేదు. మంచి ప్లాటు చూసుకుని రెండో కథ మొదలు పెట్టాలనుకున్నాను. అందులోనూ మొదటి కథకు మంచి

పేరు వచ్చింది. ఆ స్థాయి కాపాడుకోవలపిన బాధ్యత నాపైన ఉంది.

నాకు ఇరవై తొమ్మిది సంవత్సరాలు నిండడమూ, శాంత గర్భవతి కావడమూ జరిగాయి. చాలా సంతోషించాను. మనుమడిని నాన్నగారు చూడలేక పోవచ్చుగానీ ఆయన వంశం నిలబడబోతోంది!

మా యింట్లో మళ్ళీ చిరునవ్వులు చిందుతాయనీ, కొత్త జీవితం, కొత్త అనుభవం నాకు ఏర్పడుతుందనీ అనిపించి బ్రతుకు మీద మళ్ళీ ఆసక్తి పుటుకొచ్చింది. అప్పుడే నాకు మరో కథ రాయాలనిపించింది. సంసార జీవితపు తీయని అనుభూతులను పాఠకుల ముందుంచాలన్న కోరిక నన్ను రెండో కథ రాయడానికి పురిగొల్పింది. ఒకటీ అరా సంఘటనలు తీసుకుని కథ వ్రాయడం నాకు చేతకాదు. ఏది వ్రాసినా ఒక విషయం గురించి సమగ్రంగా తెలుపగలగాలి. ఆపనికి నవలలే అవపరం లేదు,కథలు చాలన్న విషయం నా మొదటి కథ నిరూపించింది.

సంసార జీవితంలోని సొగసులు వివరించే నా కథ సగం కూడా పూర్తి కాలేదు. నా సంసార జీవితం పూర్తయింది. ఏడవ నెలలో శ్రీమతిని అర్జంటుగా హాస్పటల్లో చేర్పించాల్సిన అవసరం వచ్చింది. ఆప రేషన్ చేసి కడుపులో బిడ్డను తీస్తే కానీ తల్లి ప్రాణాలు దక్కవన్నారు. కానీ అలా చేసినా తల్లి ప్రాణాలు దక్కలేదు. నాకు మిగిలిన ఒకే ఒక ఆలంబన - శాంత నన్ను వదిలి వెళ్ళిపోయింది.

సగం మాత్రమే వ్రాయబడ్డ నా రెండో కథను చించి అవతల పారేశాను. మరో పెళ్ళి చేసుకోమని నా చుట్టూ తిరిగే బంధుమిత్రులను తీవ్రంగా మాట్లాడి దూరం చేసుకున్నాను. నాకు ప్రపంచం మీద విరక్తి కలిగింది. జీవితం మీద మమకారం పోయింది.

నా ఇంట్లో ఎవ్వరూ అడుగుపెట్టరాదని శాసించాను. నేను వీధిలోకి వెళ్ళడం మానేశాను. నాకు వచ్చిన ఉత్తరాలను చదవకుండా చించి అవతల పారేసేవాడిని. నా అదృష్టం కొద్దీ భోజన సదుపాయం చూడ్డానికి సత్యం దొరికాడు. నేను కాక నా ఇంట్లో మసలే మనిషి అతనొక్కడే! పేరుకు యజమానిని నేను కానీ నా ఇంటికి అతనే సర్వాధికారి. ఏ మనిషీ నా ఎదుటపడి మాట్లాడడానికి వీల్లేదు.

అలా సన్యసించాను నేను నా ముప్పయ్యో ఏట!

నా భూములూ అవీ అమ్మేసి బ్యాంకులో నా పేర డిపాజిట్ చేశాను. ఇంటికి సరాసరి వడ్డీ డబ్బు వచ్చే ఏర్పాటు చేసుకున్నాను. సత్యం నమ్మకస్తుడనడానికి సూచనగా నేనెన్నడూ డబ్బు కిబ్బంది పడలేదు. నాకు వచ్చే డబ్బు నిక్షేపంలా సరిపోయేది.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఎప్పుడైనా బ్యాంకుకు వెళ్ళవలసిన అవసరంపడితే తప్ప వీధి ముఖం చూసేవాడిని కాదు. అప్పుడైనా చుట్టూ ప్రపంచాన్ని గమనించకుండా ఉండడానికి ప్రయత్నించే వాణ్ణి.

నా ఇంట్లో రేడియో పలకదు. నేను వార్తాపత్రికలు చదవను. మా ఇంట్లో ఉన్న ఆధ్యాత్మిక గ్రంథాలను పఠించేవాడిని. ఆధ్యాత్మికానికి సంబంధించి కొత్త గ్రంథాలేమైనా వచ్చేయేమో తెలుసుకునేందుకు అప్పుడప్పుడు సత్యాన్ని పట్నం పంపిస్తుండేవాడిని.

ఊళ్ళో ఎన్నో విశేషాలు జరుగుతూండే వనుకుంటాను. అప్పుడప్పుడు కొంతమంది స్వయంగా మా ఇంటికి వచ్చి శుభకార్యానికి రమ్మనమని ఆహ్వానించేవారు. నేను వెళ్ళేవాడిని కాదు. 'ఫలానా వారు పోయారు' అని సత్యం నాకు చెప్పేవాడు. నిర్లిప్తంగా విని ఊరుకునే వాడిని. క్రమంగా ఊళ్ళో వాళ్ళు నా ఉనికిని గుర్తించడం మానుకున్నారు.

నేనున్న స్థితిని ఏమంటారో తెలియదు. నా శరీరానికి అవసరమైన ఆహారాన్ని సమకూరుస్తూ ప్రపంచంతో సంబంధం లేకుండా సృష్టి గురించి తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. బహుశా దీన్ని తపస్సు అనవచ్చునేమో!

ఒకటి కాదు రెండు కాదు ఇరవై అయిదు సంవత్సరాలు అలా తపస్సు చేశాను. నేను తెలుసుకున్నదేమిటో తెలియదు. కానీ తెలుసుకోవాల్సినదింకా చాలా ఉన్నదనిపిస్తోంది. సాధించినదేమిటో తెలియదు. కానీ సాధించాల్సినది మాత్రం చాలా ఉందనిపిస్తోంది.

ఏది ఏమైనా నేను రాగబంధాల్ని జయించి పాతిక సంవత్సరాల పాటు దు:ఖానికి అతీతుడనై జీవించాను. వేదాంత గ్రంథాల పట్ల విసుగు కానీ, చుట్టూ ప్రపంచపు విశేషాల పట్ల కుతూహలంకానీ, నాకీ పాతిక సంవత్సరాలలోనూ కలగలేదు. అదే ఉత్తమమైన జీవిత మార్గమనీ, ప్రతి ఒక్కడూ ఈ పద్ధతిలో జీవించగలిగితే దు:ఖానికి దూరం కాగలడనీ నాకు తోచింది.

మనిషి జీవితం అశాశ్వతం. ప్రపంచంలో పుట్టిన ప్రతివాడూ చచ్చితీరవలసిందే. అటువంటప్పుడు జనన మరణాలకు సుఖ దుఃఖాలను జతపరచడం అవివేకం. ప్రతివాడూ నిర్లిప్తంగా బ్రతకడం నేర్చుకోవాలి. ఎవరి పనులు వారు చేసుకుంటూనే నిర్లిప్తతను వహించాలి. ఈ సంగతి నాకు ముప్ఫై సంవత్సరాలొచ్చేదాకా తెలియలేదు. ఆ తర్వాత పాతిక సంవత్సరాలు గడిచినా ప్రజలకు జీవన మార్గమెందుకు తెలియడంలేదో అర్థం కాలేదు.

అది అర్థమయ్యే సమయం నాకు పాతిక సంవత్సరాలు గడిచేక వచ్చింది - సత్యం హఠాత్తుగా అనుకోకుండా చనిపోవడంతో.

సుమారు అరవయ్యేళ్ళ సత్యం చనిపోవడం వింత కాదు. పాతికేళ్ళుగా విరాగినని భావిస్తున్న నాకు సత్యం మరణం దుఃఖం కలిగించడం వింత. దుఃఖంలోనూ ఇంతా అంతా కాదు. నేనూహించలేనంత పరిమాణంలో దుఃఖం కలిగింది నాకు.

నన్ను వెలివేసిందనుకున్న ఊరంతా నాకు అండగా నిలిచింది. సత్యం దహన క్రియలు యథావిధిగా జరిపోయాయి. మరొక్కసారి నాకు బయటి ప్రపంచంతో సంబంధం కలిగింది. ఎందరో నా పట్ల మిత్రభావం ప్రకటిస్తున్నారు. ఎందరో నాకు సహాయపడడానికి ముందుకు వస్తున్నారు. ఆ అభిమానాలు, ఆప్యాయతలు నన్ను కరిగించేస్తున్నాయి. సరైన అవకాశం రాలేదంతే కానీ, విరాగిననుకున్న నేను విరాగిని కాలేదు. ఇప్పుడు నేను మళ్ళీ మనుషుల మధ్య పడ్డాను.

ప్రజలకూ నాకూ మధ్య వారధిలా పనిచేశాడు సత్యం ఇంత వరకూ. అతని సహాయంతో నా అవసరాలు ప్రజల ద్వారా తీరుతూండేవి. ఆ వారధి పోయింది. అప్పుడే నేనొక సత్యం గ్రహించాను. నేనూ ప్రజల్లో ఒకడినే, కానీ కావాలని దూరంగా వెళ్ళాను. ఆ

దూరం కాపాడుకోవడానికి సత్యం పేరుగల వారధిని నిర్మించాను. వారధి నిర్మూలమైంది. నేను మళ్ళీ ప్రజల్లో కలిస్తే వారధి అవసరమే లేదు.

నేను రాగబంధాలకతీతుణ్ణి కాదని సత్యం కోసం తపించిపోయే నా హృదయం చెబుతోంది. అటువంటప్పుడు నా చుట్టూ ఉన్న మధుర బంధాలనిన్ని సంవత్సరాలు ఎందుకు వృథా చేశాను?

శంకరయ్యగారా ఊళ్ళో మోతుబరి రైతు. ఆయన నన్ను తమ ఇంటికి వచ్చి ఉండవలసిందిగా ఆహ్వానించారు. రామారావుగారా ఊరి కరణం. ఆయన నా భోజన సదుపాయాల గురించి ఏదో ఏర్పాటు చేయాలని తాపత్రయ పడుతున్నారు.''మీరొక మహాయోగి. మీరు మా ఊరి వారు కావడం మా అదృష్టం,. మీకేలోటూ రానివ్వం. మేమంతా మీవాళ్ళం'' అంటున్నారంతా ఏకగ్రీవంగా.

రాగబంధాల కతీతుడననుకున్న నన్నా మాటలు విరీతంగా సంతోషపెడుతున్నాయి. ఇటీవల తరుచుగా ఊళ్ళోని చాలా మంది ఇళ్ళకు వెళ్ళివస్తున్నాను. ఎంతోమంది చిన్నారి పాపలు నన్నాకర్షించారు. వాళ్ళ ముఖాలు చూస్తూ వాళ్ళ కబుర్లు వింటూ పొందే ఆనందంలో వేదాంత గ్రంథాల పారాయణ ఇచ్చే ఆనందం ఏపాటిది?

చాలా ఆలస్యంగా నా తప్పు గ్రహించాను. జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొని జీవించడంలో తృప్తీ, ఆనందమూ ఉంటాయి. నాకులా జీవితం నుంచి పారిపోయిన వాడికి ఆత్మవంచన మినహాయించి మరేమీ మిగలదు.

నాకు మరో వంటవాడు కుదిరాడు. ఇతను ఇరవై ఏళ్ళ కుర్రవాడు. పేరు బాబూరావు. చలాకీ అయినవాడు. మంచివాడు. అయితే, ఇతనికి నేను సత్యానికిచ్చినన్ని బాధ్యతలివ్వలేదు. వ్యవహారాలన్నీ స్వయంగా చూసుకోవడంలో కొంత ఆనందం కనబడుతోంది.

ఆ విధంగా ఎందరో మనుషుల సమస్యలతో పరిచయం లభిస్తోంది.

ఊళ్ళోని నా వయసు వాళ్ళ సంసారాలు చూస్తుంటే నా కసూయగా ఉంది. కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళతో చాలా కోలాహలంగా ఉంటున్నాయి వాళ్ళ ఇళ్ళు. నా ఇంటికి నేనొక్కడినే.

ఊరి వారందరి కోరికపై నేను ప్రతిరోజూ రాత్రి మా ఇంటి వీధరుగు మీద వేదాంత గోష్ఠి జరిగే ఏర్పాటు చేశాను. సృష్టి గురించి నాకు తెలిసినవీ, నేనర్థం చేసుకున్నవీ అందరకూ విపులీకరించి చెప్పడం నా వంతు. నే చెప్పినదంతా శ్రద్ధగా విని సందేహాలేమైనా ఉంటే, అడిగి తీర్చుకోవడం వినేవారి వంతు.

వారు నా దగ్గర్నుంచి ఏమైనా నేర్చుకుంటున్నారా అన్నదాని గురించి నేనాట్టే పట్టించుకోలేదు. నా అభిప్రాయంలో ఈ వేదాంత గోష్ఠి నా యీ బయట ప్రపంచం గురించి తెలుసుకునే అవకాశమిస్తోంది.

మేము కేవలం వేదాంతమే మాట్లాడుకునే వాళ్ళం కాదు. అవీ ఇవీ పిచ్చాపాటీ వ్యవహారాలు చాలా నడుస్తూండేవి. అప్పుడే నాకు ఎన్నో విశేషాలు తెలిశాయి. ప్రపంచంలో ఇప్పుడు ఎన్నో స్వతంత్ర దేశాలున్నాయి. ప్రజల జీవన విధానాలు మారుతున్నాయి.

మూఢాచారాలు తొలగుతున్నాయి. ఎన్నో సాంఘిక దురాచారాల్ని అరికట్టడానికి ప్రభుత్వం చట్టాన్నుపయోగిస్తోంది. పేదవారినీ పీడిత ప్రజలనూ కాపాడడమే ఆశయంగా దేశ పాలకులు భావిస్తున్నారు.

సాంఘికంగా ఇలాగుంటే, వైజ్ఞానికంగా మనిషి సాధించిన ప్రగతి అపూర్వం. మనిషి రోదసిలోకి వెళ్ళడం మాత్రమేగాక చంద్రమండలం మీద అడుగుపెట్టి అక్కడ మట్టి తీసుకుని వచ్చాడు. శుక్ర గ్రహంలోకి, అంగారక గ్రహంలోకి మానవ నిర్మిత యంత్రాలు చేరుకుని అక్కడి వివరాలు తెలియబరుస్తున్నాయి.

సృష్టి రహస్యాన్ని తెలుసుకునేందుకు మాత్రమే కాక విజ్ఞాన శాస్త్రం మానవుడి జీవితాన్ని సుఖతరం చేయడానికెన్నో గృహసాధనాలను కనిపెట్టింది. అవన్నీ తెలుసుకుంటూంటే నాకు కలా, నిజమా అనిపిస్తోంది.

ఇప్పుడు నేను వార్తా పత్రికలు చదువుతున్నాను. రేడియో వింటున్నాను. ఊళ్ళో నలుగురి మధ్య మసలుతున్నాను. తెలిసిన వింతలన్నీ నాకు ప్రపంచం పట్ల కొత్త ఆసక్తిని కలిగించగా- వైజ్ఞానికంగా, సాంఘికంగా ఇంత ప్రగతిని సాధించిన ఈ ప్రపంచంలోని ఒక భాగమైన నా దేశంలో ప్రజల జీవిత విధానమిప్పుడెలాగుందో తెలుసుకోవాలనిపించింది. ఆ ఉద్దేశ్యంతోనే నేను పత్రికా పఠనంతో పాటు కాస్త దేశ సంచారం కూడా చేయదల్చుకున్నాను.

పాత చుట్టరికాలను పైకి తవ్వి నాకు తెలిసిన వారున్న ప్రాంతాలకు వెళ్ళి కొన్నేసి రోజుల చొప్పున ఉండి వచ్చాను. సామాన్య మధ్య తరగతి కుటుంబాల సమస్యలను తెలుసుకునేందుకు ప్రయత్నించాను. నాకు తటస్థపడ్డ ప్రతి కూలి వాడినీ రిక్షా వాడినీ తరచి తరచి ప్రశ్నించి వారి వారి సంగతులు తెలుసుకునేందుకు ప్రయత్నించాను.

ఎక్కడ చూసినా రకరకాల సమస్యలు, అవినీతి, లంచగొండి తనం, అన్యాయాలు, ఎక్స్‌ప్లాయిటేషన్, వరకట్నం, కల్తీ వ్యాపారం - ఒక్కటేమిటి? లక్ష విధాల సమస్యలతో ప్రజలు బాధ పడుతున్నారు.

ఇవన్నీ నాలో సంచలనం కలిగించాయి. నాలో కవితావేశం కలుగుతోంది. ఏమిటో రాయాలనిపిస్తోంది.

ఈ మధ్య కాలంలో నాకెన్నడూ ఇంత ఆవేశం కలగలేదు. దేశ సంచారం ముగించి, ఇంటికి తిరిగి వెళ్ళేక నా ఆవేశానికి కథా రూపమిచ్చాను. నా కలం ఒకే ఊహతో నడిచి సరిగ్గా మూడు గంటలసేపు ఏకధాటిగా సాగి ఒక చక్కటి కథ తయారయింది. కథను ప్రచురణ కోసం ఒక ప్రముఖ పత్రికకు పంపాను - 'విరాగి' అనే కలం పేరుతో.

నెల రోజుల అనంతరం నాకు పత్రికా పంపాదకుని వద్ద నుంచి ఉత్తరం వచ్చింది. ఈ మధ్యకాలంలో ఇంత సమగ్రమైన మంచి కథ తన దృష్టికి రాలేదనీ, నా కథను తమ పత్రిక జన్మదిన ప్రత్యేక సంచికలో ప్రచురించటానికి నిర్ణయించుకున్నామనీ అభినందిస్తూ ఆ ఉత్తరం రాశాడు సంపాదకుడు. నాకెంతో సంతోషాన్ని కలిగించిందా ఉత్తరం.

నా కథ పత్రిక జన్మదిన ప్రత్యేక సంచికలో ప్రచురింపబడ్డాక అభినందనలు పరంపరలుగా నాపై కురిశాయి. తర్వాత సంచికలలో నా కథను పొగుడుతూ ఎన్నో ఉత్తరాలు పడ్డాయి. ఇవన్నీ నాకెంతో ఉత్సాహాన్ని కలిగించగా మరో కథ రాయాలన్న ఉద్రేకం

కూడా కలిగింది.

ఇటువంటి పరిస్థితుల్లో హఠాత్తుగా ఆ పత్రికలోనే ఒక ఉత్తరం నన్ను నిశ్చేష్టుణ్ణి చేసింది. నేనెంతో అవమాన పడిపోవలసిన సంఘటన అది!

ఆ పత్రికలో విరాగి పేరుతో పడ్డ కథ కాపీ అనీ, కొన్ని సంవత్సరాల క్రితం అదే కథ కొద్ది మార్పులతో మరో పత్రికలో ప్రచురించబడిందనీ, మర్యాదగా విరాగి తన తప్పును అంగీకరించనిపక్షంలో అసలు కథ ప్రచురింపబడ్డ పత్రిక పూర్తి వివరాలు, రచయిత పేరు తానే బయటపెట్టగలననీ, ఒక హెచ్చరిక ఉత్తరం ఆ పత్రికలో పడింది. ఆ విషయాన్ని నా దృష్టికి తీసుకువస్తూ సంపాదకుడు నా సమాధానం కోరాడు.

ఏమివ్వగలను సమాధానం? అది అక్షరాలా నా కథ. ఆ విషయమే సంపాదకునికి రాస్తూ, రచనలను చౌర్యం చేయవలసిన నీచ మానసిక స్థితికి లోనుకావలసిన అవసరం నాకు లేదని స్పష్టం చేశాను.

అనంతరం మూడు వారాలకు నాకో పెద్ద కవరు వచ్చింది పోస్టులో. అందులో ఒక ఉత్తరం. అది నన్ను సవాలు చేసిన పాఠకుడు రాశాడు. నేను రాసిన కథకు ఒరిజనల్ అతని వద్ద ఉన్నదట. దానికి ఫోటో కాపీ తీసి నాకు పంపించాడు. చదివి ఇంకా ఆ కథ నా స్వంతమేనని అనగలనేమో చెప్పమన్నాడు.

ఆ కథ చదివాను. అతను రాసింది పూర్తిగా నిజం. ఆ కథ నా కథ లాగానే ఉంది. ఏవో కొద్ది పేర్ల మార్పులు తప్పితే మిగతాదంతా ఏ విధమైన మార్పులూ లేకుండా అదే కథ. ఒకసారి రచయిత పేరు చూసి ఉలిక్కిపడ్డాను.

అది నేను వ్రాసిన మొదటి కథ.

కావడానికి విద్యుత్తు ఒక రకం శక్తి అయినప్పటికీ అది దీపాన్నయితే వెలిగిస్తుంది. ఫ్యానుని తిప్పుతుంది. స్టవ్‌ని వేడెక్కిస్తుంది. విద్యుత్తు ఎన్ని రకాల పనులు చేయగలిగినా ఒకో యంత్రం దాన్ని ఒక రకంగానే ఉపయోగించుకోగలుగుతుంది. రచయితలు యంత్రాల్లాంటి వాళ్ళయితే, భావావేశం విద్యుత్తు లాంటిది. ఒక్కో రచయిత ఒకో భావావేశాన్ని ఒకో రకంగా ప్రకటించగలుగుతాడు.

పాతికేళ్ళకు పైగా క్రితం ఎప్పుడో భావావేశం కలిగి ఒక కథ రాశాను. ఆ తర్వాత ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయి. వైజ్ఞానికంగా సాంఘికంగా మనిషి చాలా ముందుకు పోయాడు. గ్రహాంతరాలకు మనిషి వెడుతున్న రోజుల్లో భావావేశం కలిగి నేను మళ్ళీ కథ రాశాను. అదే నా రెండో కథ!

తీరా చూస్తే, నేను రాసింది రెండో కథ కాదనీ నాకు తెలియకుండా నేనే నా మొదటి కథను మళ్ళీ రాశాననీ తెలిసింది.

కేవలం భావావేశం కలిగినప్పుడే రచనలు చేసి, తన రచనలు సమగ్రంగా ఉండాలనుకునే నాలాంటి రచయిత రెండో కథ రాసే అవకాశం ఈ దేశంలో ఎప్పుడు వస్తుందో అసలు వస్తుందో రాదో అన్న విషయానికి జవాబు ఎవరుచెప్పగలరు? ★

*(నీలిమ మాస పత్రిక - సెప్టెంబర్, 1977)*